

హామీలు నెరవేర్చని ప్రభుత్వం

హామీల అమలులో కాంగ్రెస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అరుణతార ఆరోపించారు.

- 11లో ▸



దివ్యాంగులను విస్మరిస్తే..

దివ్యాంగులను విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /23.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'తల్లిపాలతో శిశువుకు రోగనిరోధక శక్తి లభిస్తుంది'



కామారెడ్డి టౌన్: తల్లిపాలతోనే శిశువుకు రోగనిరోధక శక్తి లభిస్తుందని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ పెరుగు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జీజీహెచ్‌లో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లి ముర్రు పాలు పట్టించాలన్నారు. క్రమం తప్పకుండా బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వాల్యా పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రిలో రెండు మదర్ ఫీడింగ్ గదులను ప్రారంభించారు. తల్లిపాల ప్రాముఖ్యతకు సంబంధించిన వాల్ పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించి, తల్లి పాలనే తాగించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పిల్లల విభాగాధిపతి శ్రీనివాస్ కళ్యాణి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధికి కృషి చేయాలి'




కామారెడ్డి టౌన్: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీఈవో రాజు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీవాడలోగల ప్రభుత్వ ఉన్నత, బాలికల పాఠశాలలకు ఐడీబీఐ బ్యాంక్ కామారెడ్డి శాఖ సీఎస్ఆర్ నిధులతో డెస్క్ బెంచీలు, కంప్యూటర్లు, ఫ్యాన్‌లను అందజేసింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, ఐడీబీఐ హైదరాబాద్ రీజినల్ హెడ్ వెంకటేశ్, బ్యాంక్ ఏజీఎం శ్రీధర్, కామారెడ్డి మేనేజర్ రాజు, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు జిల్లా అధికారుల బదిలీ



కామారెడ్డి అర్బన్: జిల్లాలోని ముగ్గురు జిల్లా అధికారులు హైదరబాద్‌కు బదిలీ అయ్యారు. జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కోటేశ్వర్లు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ లేబర్ కమిషనర్‌గా ప్రమోషన్‌పై వెళ్లారు. జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథం హైదరాబాద్ సెట్విన్ పరిపాలన అధికారిగా బదిలీ అయ్యారు. పౌరసరఫరాల జిల్లా అధికారి రాజేందర్ పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా కామారెడ్డి కార్మికశాఖ అధికారిగా ఆర్మూర్ నుంచి ప్రభుదాస్, జిల్లా యువజన క్రీడల ఇన్‌చార్జి అధికారిగా వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.వెంకటేశ్వర్‌గౌడ్‌ను నియమించారు. పౌరసరఫరాల జిల్లా అధికారిని ఎవరినీ నియమించలేదు. బదిలీ అయిన అధికారులను మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్లు చందర్, విక్టర్ సన్మానించి, వీడ్కోలు పలికారు.

'అధికారుల సూచనలు పాటించాలి'



నిజాంసాగర్: పంటల సాగులో వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలను రైతులు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ, మహమ్మద్‌నగర్, కోమలంచ, తుంకిపల్లి గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. అధికారుల సూచనల మేరకే పురుగుల మందులు పిచికారి చేయాలన్నారు. ఫర్టిలైజర్ షాప్‌లను సందర్శించి రికార్డులను పరిశీలించారు. చిట్టీ లేకుండా ఎవరికీ పురుగుల మందులు ఇవ్వవద్దని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి నవ్య, ఏఈవోలు మధుసూదన్, రేణుక రైతులు ఉన్నారు.



కరీంనగర్ - కామారెడ్డి - ఎల్లారెడ్డి రహదారి

కేకేవై.. దశ తిరిగేదెప్పుడో?

- ప్రతిపాదనల దశ దాటని ప్రజల డిమాండ్
- డీపీఆర్ కూడా తయారు కాని వైనం
- ఏళ్లు గడుస్తున్నా ముందుకు పడని అడుగులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో అత్యంత కీలకమైన కేకేవై రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలన్న ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ప్రతిపాదనల దశ దాటడం లేదు. కనీసం డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) కూడా తయారు కాలేదు. కరీంనగర్ నుంచి సిరిసిల్ల, కామారెడ్డి, ఎల్లారెడ్డి మీదుగా పిట్లం వరకు 165 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని దశాబ్దాలుగా ప్రజలనుంచి డిమాండ్ ఉంది. ఇందులో దాదాపు 90 కిలోమీటర్లు కామారెడ్డి జిల్లా పరిధిలోనే ఉంటుంది. అయితే 165 కిలోమీటర్ల నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి రూ. 825 కోట్లు అవసరం అవుతాయని అప్పట్లో ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ రహదారిపై పొద్దస్తమానం వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. ఎప్పుడూ రద్దీగా కనిపిస్తుంది. వేలాది వాహనాలు తిరుగుతుండడం, చాలా చోట్ల మూలమలుపులు, ఇరుకైన వంతెనలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేస్తే ప్రమాదాలు నివారించడంతోపాటు రవాణా సౌకర్యం కూడా మెరుగుపడుతుంది.

మూడు హైవేలు... మూడు రాష్ట్రాలు..

కరీంనగర్ నుంచి కామారెడ్డి, ఎల్లారెడ్డి మీదుగా పిట్లం వరకు జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తే మూడు జాతీయ రహదారులను అనుసంధానం చేసినట్లవుతుంది. అలాగే తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు రాకపోకలు సులభమవుతాయి. కామారెడ్డి మీదుగా వెళ్లే బెంగళూరు, నాగ్‌పూర్ రహదారి (ఎన్‌హెచ్–44), అలాగే ఎల్లారెడ్డి మీదుగా వెళ్లే హైదరాబాద్, మెదక్, బాన్సువాడ రహదారి (ఎన్‌హెచ్ –765 డీ), పిట్లం, మద్నూర్ మీదుగా వెళ్లే సంగారెడ్డి, నాందేడ్, అకోలా రహదారుల(ఎన్‌హెచ్– 161)కు ఈ రోడ్డు కలుస్తుంది. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి దక్షిణ తెలంగాణలోని సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు అలాగే మహారాష్ట్ర, కర్ణాటకలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. కర్ణాటకలోని బీదర్, గుల్బర్గా.. అలాగే మహారాష్ట్రలోని నాందేడ్, దెగ్లూర్ పట్టణాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ దారి అనుకూలంగా ఉంటుంది. ఈ రహదారి గుండా ఆయా ప్రాంతాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లడానికి మార్గం అనువుగా ఉంటుంది. కర్ణాటకలోని గానుగాపూర్‌లో ఉన్న దత్తాత్రేయ మందిరం, బీదర్‌లో ఉన్న జర్ని నర్సింహ ఆలయం, వేములవాడలోని రాజరాజేశ్వరాలయం, రామారెడ్డి కాలభైరవ ఆలయం, భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం.. ఇలా ప్రముఖ ఆలయాలకు వెళ్లడానికి రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది.

165 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రహదారి పూర్తిగా జహీరాబాద్, కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలోనే ఉంది. జహీరాబాద్ నియోజకవర్గంలో 90 కిలోమీటర్లు ఉండగా, కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలో 75 కిలోమీటర్లు ఉంటుంది. కేకేవై రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్ ఏళ్లుగా ఉంది. ఇటీవల కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి జాతీయ రహదారి నిర్మాణానికి డీపీఆర్ తయారు చేయించి పనులు చేపట్టాలని కోరారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ద్వారా కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి జాతీయ రహదారి అంశాన్ని తీసుకువెళ్లారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి గతంలో కేంద్ర మంత్రిని కలిసి కేకేవై రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే త్వరలోనే కల సాకారమవుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ఎంపీలు దృష్టి సారిస్తేనే..

జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తే మూడు రాష్ట్రాల మధ్య సరుకు రవాణాకు కూడా అనుకూలంగా ఉంటుంది. అలాగే పారిశ్రామికాభివృద్ధికి దోహదపడుతుంది. ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఆయా ఉత్పత్తులను రవాణా చేయడం సులువవుతుంది. జుక్కల్ నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే పప్పు దినుసులు, సోయా, పత్తి వంటి పంట

సరుకు రవాణాకు అనుకూలం..

ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు పంపడానికి ఈ దారి అనుకూలంగా ఉంటుంది. మద్నూర్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్లులు ఉండగా, కామారెడ్డి, ఎల్లారెడ్డి, సిరిసిల్ల ప్రాంతాలలో ఉత్పత్తి అయ్యే పత్తిని ఆయా మిల్లులకు తీసుకువెళ్లడానికి అనుకూలంగా ఉంటుంది. ఇవే కాక భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యేందుకు అవకాశాలుంటాయి. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి జాతీయ రహదారిని సాధించాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసే కుట్ర

- అందులో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం
- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్
- హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించిన నేతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టను, తద్వారా బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు, కమిషన్ విచారణ తదితర అంశాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కామారెడ్డిలోని గంప ఇంట్లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ఆ పార్టీ నేతలు వీక్షించారు. అనంతరం గంప మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ సమయంలో నిర్మించి దాని ఫలాలను రైతాంగానికి అందించిన కేసీఆర్, హరీశ్‌రావులను టార్గెట్ చేసి విచారణ పేరుతో కమిషన్‌లు ఏర్పాటు చేశారన్నారు. కాళేశ్వరంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయకసాగర్, మిడ్ మానేర్.. ఇలా ఎన్నో ప్రాజెక్టులు, బ్యారేజీలు, టన్నెల్స్, కాలువలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్కచోట రెండు పిల్లర్లు కుంగితే కాళేశ్వరం కూలిందనే దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. దెబ్బతిన్న రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేసి రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను బద్నాం చేయాలని కాంగ్రెస్ చేసిన కుట్రలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే..

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని హామీలు ఇచ్చి మోసం చేసిన రేవంత్‌రెడ్డి.. మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు అన్ని వర్గాలను మోసం చేశారని గంప గోవర్ధన్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా, ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాళేశ్వరం కూలిందంటూ దుష్ప్రచారం చేశారన్నారు. దీనిని గ్రామగ్రామాన ప్రజలకు వివరించి కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, జుక్కల్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, జాజాల సురేందర్, పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి జుబేర్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, మాజీ ఎంపీపీలు బాలమణి, దశరథ్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్‌లు నల్లవెల్లి అశోక్, కపిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుంబాల రవి, నాయకులు కుంబాల ప్రభాకర్, బాల్‌చంద్రం, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బలవంతరావ్, శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, నేతలు

ఎంఈడీ పరీక్ష ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 18 వరకు చెల్లించాలని కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్ 2025లో జరగబోయే ఎంఈడీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షల కు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నె ల 18వరకు ఫీజు చెల్లించాలన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 21వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. పూ ర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రాజంపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన ఆర్గొండలో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాలకృష్ణను ఆదేశించారు. అంతకుముందు ఆయన ప్రైమరీ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులను గణితంలో పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, మండల ప్రత్యేకాధికారి అపర్ణ, తహసీల్దార్ జానకి, ఎంఈవో పూర్ణచందర్‌రావు, ఎంపీవో రఘురాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




ఆర్గొండలో ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఈవీఎం గోదాం పరిశీలన

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం పరిశీలించారు. సీసీ కెమెరాలు, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. బందోబస్తు పకడ్బందీగా ఉండాలని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి

కామారెడ్డి క్రైం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన రాజంపేటకు వెళ్తుండగా కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి వద్ద రోడ్డు వెంట చెత్త పేరుకుపోయి ఉండడాన్ని చూసి వాహనం ఆపారు. పరిసరాలను పరిశీలించి పంచాయతీ సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.



చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట



కె.ఆనంద్



జి.పరశురాం



ఎం.ఈశ్వర్



కె.హరిత



కె.మేఘన

కామారెడ్డి అర్బన్: హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్స్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్–16 జావెలిన్ త్రోలో కె.ఆనంద్, అండర్–20 డెకాథ్లాన్‌లో జి.పరశురాంలు బంగారు పతకాలు సాధించగా.. అండర్–18 వెయ్యిమీటర్ల పరుగులో కె.హరిత కాంస్య పతకం పొందారు. అండర్–20లో ఎం.ఈశ్వర్ 800 మీటర్ల పరుగులో వెండి, 1,500 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళా విభాగంలో కె.మేఘన జావెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ అభినందించారు.

'బతుకమ్మ' పరవళ్లు

తాడ్వాయి: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి సోమారం తండా నుంచి సోమారం గ్రామం వెళ్లే మార్గంలోనున్న బతుకమ్మ వాగు ఉధృతంగా ప్రవహించింది. లోలెవెల్ బ్రిడ్జి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. రహదారిపై నుంచి వాగు నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో సోమారం గ్రామంలో చదువుకుంటున్న సోమారం తండా స్కూల్ విద్యార్థులు, కొంతమంది తండా గ్రామస్తులు గ్రామానికి తిరిగి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సోమారం గ్రామ పంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించి, ట్రాక్టర్ సహాయంతో వారిని రోడ్డు దాటించారు.



సోమారం శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న బతుకమ్మ వాగు

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు మంగళవారం నీటి విడుదల చేపట్టినట్లు నీటిపారుదల శాఖ ఏఈ అక్షయ్ తెలిపారు. 600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రధాన కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీటిని ఆయకట్టు ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు పోచారం ప్రాజెక్టు నుంచి..



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి బుధవారం నీటిని విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోచారం ఆయకట్టు పరిధిలో వానాకాలం పంటల సాగు నిమిత్తం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.244 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

16న కామారెడ్డి మీదుగా 'భారత్ గౌరవ్' రైలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పంచ జ్యోతిర్లింగ క్షేత్రాలను దర్శించుకోవాలని భావిస్తున్న వారి కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక టూరిజం రైలును నడుపుతోంది. ఇది సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఈనెల 16న ప్రారంభం కానుంది. ఎనిమిది రాత్రులు, తొమ్మిది రోజులు సాగే ఈ రైలు.. కామారెడ్డి మీదుగా వెళ్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్, భీమశంకర్, గృష్ణేశ్వర్, మధ్యప్రదేశ్‌లోని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగాలను చుట్టి వస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైలు 16వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతుందని తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్కేడ్, నాందేడ్, పూర్ణ మీదుగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చేరుకుంటుందని, ఆయా క్షేత్రాల దర్శనం అనంతరం తొమ్మిదో రోజు తిరిగి సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని వివరించారు. పంచ జ్యోతిర్లింగాలను దర్శించుకోవాలనుకునేవారికోసం ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్లీపర్ క్లాస్‌లో టికెట్ ధర ఒకరికి రూ.14,700, థర్డ్ ఏసీలో రూ. 22,900, సెకండ్ ఏసీలో 29,900 ఉంటుందని వివరించారు. ప్యాకేజీలో భాగంగా రోజుకు మూడుసార్లు భోజనా లు, వసతి, పర్యాటక రవాణా సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అవసరమైన సమాచారం ఇచ్చేందుకు ప్రతి బోగీలో ఐఆర్‌సీటీసీ సిబ్బంది అందుబాటులో ఉంటారని, బుకింగ్‌తోపాటు పూర్తి వివరాల కోసం (www.irctctourism.com) వెబ్‌సైట్‌లోగానీ, 97013 60701, 92810 30740, 92810 30750, 92810 30711 నంబర్లలోగానీ సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

నస్రుల్లాబాద్‌లో గ్రామ సభ



నస్రుల్లాబాద్: పలు గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్(పీఏఐ) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పరిధిలోని అధికారుల నుంచి గ్రామీణ ప్రజల వివరాలను సేకరిస్తామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. జీపీ కార్యదర్శి రాజేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు మందుల పిచికారీ

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ ఈవో లక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం దోమల నివారణ మందును పిచికారకీ చేశారు. ప్రతి రోజూ రాత్రి గ్రామంలో దోమల బెడద నివారణకు ఫాగింగ్ కూడా నిర్వహిస్తున్నామన్నారు.

తల్లి పాలే బిడ్డలకు సురక్షితం



పిట్లం(జుక్కల్): బిడ్డలకు తల్లి పాలే సురక్షితమని, తల్లి పాలు తాగిన శిశువులు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో సౌభాగ్య పేర్కొన్నారు. అన్నారం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సెంటర్‌లోని పిల్లల బరువు, ఎత్తు, కొలతలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలల పాటు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం అనంతరం 7 నెలలు పూర్తయిన చిన్నారులకు అన్న ప్రాశన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ సుమలత, అంగన్వాడీ టీచర్ అనురాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించాలి



ఎల్లారెడ్డిరూరల్: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. మంగళవారం రేపల్లెవాడ అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



నిజాంసాగర్ (జుక్కల్): మాగి, గోర్గల్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం స్థానిక ఎంపీడీవో గంగాధర్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో చిన్నారుల హాజరు, స్టాక్ రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, తదితరులున్నారు.

అప్పు చేసి పప్పు కూడు

- సకాలంలో అందని బిల్లులు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు తప్పని ఇబ్బందులు
- అందాల్సిన బకాయిలు రూ.3 కోట్లు



వజ్జపల్లిలో మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థుల హాజరును మెరుగుపర్చాలనే సదుద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అభాసుపాలవుతోంది. బిల్లులు సకాలంలో అందకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి పిల్లలకు భోజనం వడ్డించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 532 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. 975 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు పని చేస్తున్నాయి. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రూ.3 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. 1 నుంచి 5వ తరగతి వరకు రూ.6.78 .. 6, 7, 8 తరగతులకు రూ.10.17.. 9,10 తరగతులకు ఒక్కో విద్యార్థికి(గుడ్డుతో కలిపి) రూ.11.17 అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు..	
మోడల్ స్కూల్స్	06
ప్రాథమిక పాఠశాలలు	698
ప్రాథమికోన్నత పాఠశాలలు	124
ఉన్నత పాఠశాలలు	191
మొత్తం విద్యార్థుల సంఖ్య	74,892

బిల్లులు రాక అప్పులు చేస్తున్నాం



మధ్యాహ్న భోజన బిల్లులు సకాలంలో అందకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పిల్లలకు భోజనం పెట్టకపోతే అధికారుల నుంచి ఒత్తిడి తప్పడం లేదు. ఎలాగైనా సరే భోజనం పెట్టాల్సిందే అంటూ అధికారులు చెప్పడం వల్ల తాము అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే చాలా ఇబ్బంది అవుతుంది. వెంటనే బిల్లులు విడుదల చేయాలి. -పోసాని దుర్గయ్య, ఏజెన్సీ నిర్వాహకుడు, సదాశివనగర్

పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే..



మధ్యాహ్న భోజన బిల్లులు సకాలంలో అందజేస్తున్నాం. ప్రతి నెలా నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. కోడ్డి గుడ్లకు సంబంధించిన 9 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తున్నాం. త్వరలో పెండింగ్ బిల్లులు అందేలా దృష్టి సారిస్తాం.
-యోసెఫ్, ఎంఈవో, సదాశివనగర్

'విద్యార్థులకు ప్రోత్సాహకాలు అభినందనీయం'



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో, డీటీవో

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహకంగా నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేయడం అభినందనీయమని డీఈవో ఎస్.రాజు, డీటీవో బి.వెంకటేశ్వర్లు అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున నగదు, ప్రశంసా పత్రాలు, రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి క్రీడాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో, డీటీవోలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సంఘం ప్రతినిధులు గంగాగౌడ్, ఉపేందర్, అర్జున్‌రావు, తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ



ఆర్మూర్: ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్‌గా అభిగ్యన్ మాల్వియా ఐఏఎస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, అధికారులు అభినందనలు తెలిపారు.

ట్రాన్స్ 'ఫార్మర్ల' కష్టాలు

- 15 రోజులు గడిచినా మరమ్మతులకు నోచుకోని కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు
- కరెంటు లేక ఎండుతున్న పొలాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు



ట్రాక్టర్‌పై కామారెడ్డికి తరలిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్



సదాశివనగర్‌లో ఎండుతున్న వరి పొలం

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట చేతికి వచ్చేదాకా నమ్మకం లేకుండా పోతోంది. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు వాతావరణం అనుకూలించడం లేదు. దీంతో సకాలంలో వర్షాలు కురువకపోవడం వల్ల రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి వరి సాగు చేస్తున్న రైతులు ఆకాశం వైపు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు వ్యవసాయ బావుల వద్ద ఉన్న బోర్ల మీద ఆశలు పెట్టుకున్న రైతులు పడుతున్న కష్టాలు వర్ణతీతం. వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లు తరచూ కాలిపోతున్నాయి.ట్రాన్స్‌కో అధికారులు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడం వల్ల సాగు చేసిన వరి పొలాలు బీటలు వారుతున్నాయి. త్వరగా మరమ్మతులు చేపడితే తమ పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండదని రైతులు అంటున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



15 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా అధికారులు పట్టించుకోకపోవడం వల్ల పంటలు ఎండుతున్నాయి. అధికారులు పట్టించుకుని ఉంటే తమ పొలాలు ఏండేవి కావు. ఎండిన పంటల వైపు చూస్తే మా బాధలు అర్థమయ్యేవి.
– మల్లయ్య, సదాశివనగర్ రైతు

దివ్యాంగులను విస్మరిస్తే పోరాటం తప్పదు

- తక్షణమే రూ.6 వేల పెన్షన్ హామీ అమలు చేయాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కామారెడ్డి టౌన్: దివ్యాంగులను విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం తప్పదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల మరో గర్జన సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలలో దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన రూ.6 వేల పెన్షన్ హామీని తక్షణమే అమలు చేయాలని, లేకుంటే ప్రభుత్వం మెడలు వంచైనా సాధించుకుంటామన్నారు. హామీ ఇచ్చి 20 నెలలు గడుస్తున్నా అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగే దివ్యాంగుల మహాగర్జనకు రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశీ, జిల్లా అధ్యక్షుడు కోలా బాల్‌రాజ్‌గౌడ్, రాజ్యలక్ష్మి, అఫిజా, మంగమ్మ, దశరథం, యాదగిరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరం



జిల్లా కేంద్రంలో యూఎస్‌పీసీ ధర్నాలో మాట్లాడుతున్న అనిల్ కుమార్

- యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు అనిల్ కుమార్

కామారెడ్డి టౌన్: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆకుల బాబు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవులా, నేతలు నరేందర్, గంగారాం, క్యాతం సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంసీ మెడికల్ కాలేజ్ పేరిట మోసం!

- పలువురి వద్ద రూ.కోట్లు వసూలు చేసిన నిందితుడు!
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



సీఎంసీ మెడికల్ కాలేజ్

నిజామాబాద్‌నాగారం/డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులో గల సీఎంసీ (క్రిస్టియన్ మెడికల్ కాలేజ్) పేరిట ఓ వ్యక్తి నగరంలోని పలువురి వద్ద రూ.కోట్లలో డబ్బులను వసూలు చేశాడు. కానీ వైద్యశాలకు అనుమతి రాకపోవడం, సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతో నిందితుడిని నిలదీసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. కర్ణాటకకు చెందిన షణ్ముఖ మహాలింగం అనే వ్యక్తి సీఎంసీని ఇటీవలే పునఃప్రారంభించారు. ఈక్రమంలో అతడు ఓ ఐఎంఏ నేతకు డైరెక్టర్ పదవి ఇస్తానని చెప్పి రూ. 3కోట్ల వరకు నొక్కేసినట్లు సమాచారం. దీంతోపాటు వైద్యులను ఫ్యాకల్టీగా పెట్టుకుంటానని చెప్పడంతో జిల్లాలో ఉన్న పలువురు వైద్యుల వద్ద షణ్ముక లింగం చెప్పినట్లు అతడు డబ్బులు వసూలు చేసి ఇచ్చినట్లు సమాచారం. అలాగే కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించడంతో పాటు మూడు నెలలుగా కొంతమంది డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఇతర ఉద్యోగులను,శానిటేషన్, సెక్యూరిటీగార్డ్స్ తదితర సిబ్బందిని నియమించుకున్నారు. నియామకాల్లో కూడా ఒక్కొక్కరి వద్ద రూ. 50వేల నుంచి రూ. 1లక్ష వరకు వసూలు చేసినట్లు సమాచారం. కానీ జీతాలు ఇవ్వకపోవండతో సీఎంసీ చైర్మన్ అని చెప్పుకునే షణ్ముకమహాలింగంను కొన్ని రోజుల క్రితం సిబ్బంది నిలదీయడంతో వెలుగులోకి వచ్చింది. పోలీసులు వచ్చి షణ్ముకను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది.

అనుమతి ఇవ్వని ఎన్ఎంసీ..

సీఎంసీని పున:ప్రారంభించడంతో నెల కిందటే ఎన్ఎంసీ బృందం ఢిల్లీ నుంచి వచ్చి పరిశీలించింది. నిబంధనలు పాటించలేదని అనుమతి ఇవ్వలేమని తేల్చిచెప్పేశారు. సీఎంసీ కాలేజ్‌లో ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే ఖచ్చితంగా వైద్యారోగ్యశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో నిర్వాహకులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో మూడు నెలల ప్రాథమిక అనుమతి ఇచ్చారు. ఇందుకోసం అధికారులు పెద్ద ఎత్తున ముడుపులు అందుకున్నారని శాఖలో ఉద్యోగులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

చీటింగ్ కేసు నమోదు చేశాం..

సీఎంసీ కాలేజీకి సంబంధించి డాక్టర్ అజ్జ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షణ్ముఖ మహాలింగంపై చీటింగ్ కేసు నమోదు చేశాం. విచారణ చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం.
–మహమ్మద్ షరీఫ్, డిచ్‌పల్లి ఎస్సై

హైవేపై పల్టీలు కొట్టిన కారు



ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామ శివారులోగల జాతీయ రహదారిపై ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన షేక్ హమీద్, షేక్ నదీప్, షేక్ అలీ ముగ్గురు కలిసి మంగళవారం ఉదయం శంషాబాద్ ఏయిర్‌పోర్టు నుంచి నిజామాబాద్‌కు బయలుదేరారు. గన్నారం గ్రామ శివారులోగల జాతీయ రహదారిపై వారి కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి పల్టీలు కొట్టి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. వెంటనే స్థానికులు గమనించి కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీశారు.

జంబిహనుమాన్ ఆలయ అధికారులపై విచారణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయంలో గతేడాది జరిగిన చోరీపై మంగళవారం ఆలయ అధికారులను ఎండోమెంట్ అధికారులు విచారించారు. ఆలయంలో గత సంవత్సరం అక్టోబర్‌లో జరిగిన చోరీపై గతంలో శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా దేవాదాయ శాఖ విచారణ అధికారి అంజలిదేవి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌రామరావు ఆలయంలో ఈవో రవీంధర్, జూనియర్ అసిస్టెంట్ హరితరాణి, అటెండర్ గోపిపై విచారణ చేపట్టారు. శివసేన పార్టీ నాయకుల, అధికారుల పరస్పర ఆరోపణలను విచారణ అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ నివేదికను ఎండోమెంట్ కమిషనర్‌కు ఇవ్వనున్నట్లు అంజలిదేవి తెలిపారు. అలాగే ఈవో రవీంధర్‌ను, జూనియర్ అసిస్టెంట్ హరితరాణిని, అటెండర్ గోపిలను సస్పెండ్ చేయాలని శివసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విచారణలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారయణ, అయ్యప్ప సేవాసమితి సభ్యులు, పంతులు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సైబర్‌క్రైమ్ డబ్బులు రికవరీ

రుద్రూర్: కోటగిరిలో సైబర్ మోసానికి గు రైన వ్యక్తికి మంగళవారం డబ్బులను రికవ రీ చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరి మండల కేంద్రానికి చెందిన పాకల నడ్పి సాయిలుకు ఏప్రిల్ 3న అనుమానాస్పద లింక్ మెసేజ్ రాగా ఓపెన్ చేశాడు. దీంతో సైబర్ నేరగాళ్లు సా యిలు సిమ్‌ను స్వాప్ చేసి అతనికి వచ్చే మెసేజ్‌లను వేరే నెంబర్‌కు వెళ్లేలా చేశారు. అనంతరం సాయిలు బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులను వాళ్ల ఖాతాకు మళ్లించుకున్నారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోయినట్టు గుర్తించిన బాధితుడు కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో వచ్చి తెలియజేశాడు. వా రు స్పందించి సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయించగా నిందితుల ఖాతాను స్తంభింపచేశారు. అనంతరం రికవరీ చేసిన రూ. ఐదు వేలను కోర్టు ఆదేశాల మేరకు సోమవారం బాధితుడి ఖాతాలో జమ చేసినట్లు ఎస్సై వివరించారు.

32 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గౌరారం గ్రామంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న 32 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. కోటగిరి గ్రామానికి చెందిన మహమ్మద్ ఉమేర్, బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి అందె మనోహర్ ఇద్దరు కలిసి మారుమూల గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి బోలెరో వాహనంలో ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తుండగా, పోలీసులు నిఘా ఉంచి పట్టుకున్నారు. ఉమేర్, మనోహర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

బావిలో పడి ఒకరి మృతి

భిక్కనూరు: లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రైతు రాజేశ్వర్ తన బావిలో ఉన్న మోటర్ పంపు చెడిపోవడంతో మరమ్మతులు చేయించడానికి మంగళవారం కూలీలను పిలిచాడు. ఈక్రమంలో దోమకొండ బాలయ్య (45)అనే కూలీతోపాటు మరో ఇద్దరు బావిలోకి దిగారు. పంపును పైకి తీసుకువస్తుండగా బాలయ్యకు అకస్మాత్తుగా అనారోగ్య సమస్య తలెత్తడంతో నీటిలో పడి, మునిగిపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి బాలయ్య మృతదేహాన్ని పైకి తీసుకవచ్చారు. మృతుడికి భార్య సావిత్రి, ఇద్దరూ కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

లింగంపేటలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి తండాలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఎస్సై దీపక్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. అయ్యపల్లి తండాకు చెందిన దేవసోత్ రాములు(65) సోమవారం సాయంత్రం తండా శివారులోకి పశువులను మేపడానికి వెళ్లాడు. ఈక్రమంలో పశువులు చెరువులో దిగడంతో వాటిని బయటకు తీసుకరావడానికి అతడు చెరువులోకి దిగాడు. ప్రమాదవశాత్తు అతడు చెరువులోని గుంతలో మునిగిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని బయటకు తీశారు. కానీ అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి..?

మాచారెడ్డి: అక్కాపూర్, ఇసాయిపేట అటవీ ప్రాంతంలో ఓ చిరుత కలకలం సృష్టించింది. లేగదూడపై దాడి చేసి చంపింది. వివరాలు.. అక్కాపూర్‌కు చెందిన అరిగె నర్సయ్య సోమవారం రాత్రి లేగదూడను చేను వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం అతడు చేను వద్దకు వెళ్లగా లేగదూడ మృతిచెంది ఉంది. వెంటనే అతడు అటవీ అధికారులకు సమాచారం అందించారు. మాచారెడ్డి ఇన్‌చార్జి రేంజ్ అధికారి రమేశ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. లేగదూడ మెడభాగంలో కొరికిన గాయాలను, తుంటి వద్ద ఉన్న గాయాలను పరిశీలించారు. చిరుత దాడి అనే అనుమానం వ్యక్తం చేసి అటవీ ప్రాంతంలో ట్రాక్ కెమెరాలను అమర్చారు. ఆ ప్రాంతంలో పాద ముద్రలను పరిశీలించారు. రమేష్ మాట్లాడుతూ.. పశువులను అటవీ ప్రాంతంలో మేపవద్దని, ఒంటరిగా వెళ్లొద్దని శివారు ప్రాంత రైతులకు సూచించారు. సెక్షన్ ఆఫీసర్ ఫారుక్, బీట్ అధికారులు శేఖర్, ప్రశాంత్, మహేశ్వరి, పద్మ ఉన్నారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష


బాల్కొండ: మండల కేంద్రంలోని ఓ వైన్స్ దుకాణంలో చోరీకి పాల్పడిని వ్యక్తికి ఆర్మూర్ కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా.. బాల్కొండలోని తుల్జా భవాని వైన్స్ షాపులో 2024 సెప్టెంబర్ 4న నిర్మల్ మండలం కొండపూర్ గ్రామానికి చెందిన నక్క పోశెట్టి చోరీకి పాల్పడ్డాడు. షట్టర్ తాళం పగలగొట్టి రూ. 14వేల నగదుతోపాటు కొన్ని మందు బాటిళ్లను ఎత్తుకెళ్లాడు. ఈఘటనపై అప్పటి ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకొని, ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి సరళరాణి సాక్ష్యాధారాలను పరిశీలించి, మంగళవారం అతడికి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఆయన తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఒకరికి..

నిజామాబాద్ లీగల్: కులం పేరుతో దూషించి, దాడి చేసిన కేసులో ఒకరి కి నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా.. నగరంలోని మిర్చి కాంపౌండ్ చెందిన దుర్గయ్యను, తన కొడుకును క్రాంతి కుమార్ అనే వ్యక్తి 24 డిసెంబర్ 2020న కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుని కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన జడ్జి నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.2,400 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

మోతీరాంనాయక్ తండాలో ఉద్రిక్తత

- అటవీ భూమిలో వేసిన మొక్కజొన్న పంటకు గడ్డిమందు స్ప్రేకు ఫారెస్టు అధికారుల యత్నం
- అడ్డుకున్న గిరిజనులు
- మనస్తాపంతో గడ్డి మందు తాగిన రైతు!



ఫారెస్ట్ అధికారులను అడ్డుకుంటున్న గిరిజనులు, మహిళలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని బైరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మోతీరాం నాయక్ తండాలో మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. అటవీభూమిలో పంట సాగుచేయడంతో ఫారెస్టు అధికారులు పంటకు గడ్డి మందు పిచికారి చేయడంతో అధికారులకు, గిరిజనులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా.. తండాకు చెందిన ప్రకాశ్ అనే గిరిజన రైతు అటవీ భూమిలోని 3ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. ఏప్రిల్ 29న రైతు ఆ భూమి చదును చేయగా, ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు రావడంతో చదును చేయవద్దన్నారు. అవేమీ పట్టించుకోకుండా సదరు రైతు పంట సాగుచేయడంతో మేలో నోటీసులిచ్చారు. అయినా అతడు స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎఫ్ఆర్‌వో రాధిక సమక్షంలో ఫారెస్ట్ అధికారులు గడ్డి మందు స్ప్రే చేశారు. వెంటనే అధికారులను ప్రకాష్ కుటుంబంతో పాటు గిరిజనులు అడ్డుకున్నారు. కొన్ని రోజుల్లో పంట చేతికొస్తుందని, ఆ తర్వాత పంట వేయబోమని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే రెండెకరాల్లో మందును స్ప్రే చేసినట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురిని సముదాయించారు. చేతికొచ్చిన పంటను అధికారులు నాశనం చేయడంతో మనస్తాపానికి గురైన రైతు ప్రకాష్ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయనను వెంటనే నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా ప్రకాశ్ గడ్డి మందు తాగలేదని, తమను బెదిరించేందుకు అలా చేశారని ఫారెస్ట్ అధికారులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా అటవీభూమిని సాగుచేయడమే కాకుండా ఫారెస్టు అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. అటవీ అధికారుల ఫిర్యాదు మేరకు రైతు ప్రకాష్, అతడి భార్య కవిత, బంధువైన జలెందర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.